సాక్షి సంగారెడ్డి
సోమవారం । 26 । ఆగస్టు । 2024



విద్యార్థులను 'ఇన్‌స్పైర్' చేద్దాం

జిల్లాలోని అన్ని పాఠశాలలు తప్పనిసరిగా ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు.

వివరాలు 8లో ▸



బిల్లులు రాక.. పనులు సాగక

సరిపడా నిధులు మంజూరు కాకపోవడంతో పంచాయతీ భవనాల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

వివరాలు 8లో ▸



నిర్మించారు.. వదిలేశారు!

సదాశివపేట పట్టణంలో నిర్మించిన నాన్‌వెజ్ మార్కెట్ సముదాయం నిరుపయోగంగా మారింది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

విశ్వశాంతి కోసం పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్ : విశ్వశాంతి కోసం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వీరభద్ర స్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయం వరకు చేపట్టిన 17వ మహా పాదయాత్రను ఆదివారం వారు జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 12వ శతాబ్దంలో అభ్యుదయ సమాజం కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నర్సింహారెడ్డి, అశోక్, చంద్రశేఖర్, రాజు, పాల్గొన్నారు.

కేతకీలో బీదర్ ఎమ్మెల్యే పూజలు



పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో బీదర్ సౌత్ ఎమ్మెల్యే శైలేందర్ బిల్దాలే కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన వారికి అధికారులు, అర్చకులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సన్మానించారు.

విధుల నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర గురుకుల పాఠశాల విద్యార్థిని చితకబాదిన తాత్కాలిక ఉపాధ్యాయుడు గోపిని విధుల నుంచి తొలగించినట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్యగౌడ్ ఆదివారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలరాజుపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు పోలీస్ స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. గాయపడిన విద్యార్థికి ఆస్పత్రిలో వైద్యం చేయించి తల్లిదండ్రులతో ఇంటికి పంపించినట్లు చెప్పారు.

కార్మికులకు అండగా సీఐటీయూ



మాట్లాడుతున్న మల్లికార్జున్

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : కార్మికుల సంక్షేమమం కోసమే సీఐటీయూ నిరంతరం పని చేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఆదివారం స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో తోషిబా పరిశ్రమ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోషిబాలో అవకాశవాదులను ఓడించి, సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు కోరారు. చారిత్రాత్మకమైన వేతన ఒప్పందం చేసిన ఘనత సీఐటీయూదేనని, గతంలో ఉన్నవాళ్లు ఈ పరిశ్రమలో ఏ ఒక్క హక్కు కూడా సాధించలేదని విమర్శించారు. సీఐటీయూ వచ్చిన తర్వాతే కార్మికులకు ఉద్యోగ భద్రత సాధ్యమైందన్నారు. ఎల్లవేళలా కార్మికులకు సీఐటీయూ అందుబాటులో ఉంటుందని, చుక్క గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, అనంతరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, రహీం, తిరుపతి పాల్గొన్నారు.

తెరుచుకోని పీహెచ్‌సీలు

అల్లాదుర్గం(మెదక్): విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టర్, ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్ఓ షోకాజ్ నోటీసులు ఇచ్చి నెల రోజులు గడవక ముందే మళ్లీ విధులకు దుమ్మా కొట్టారు. ఆదివారం మధ్యాహ్నం వరకు రోగులకు వైద్య సేవలు అందించాల్సి ఉన్నా.. విధులకు రాకపోవడంతో అల్లాదుర్గం, గడిపెద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తెరుచుకోలేదు. దీంతో చేసేదేమిలేక రోగులు తిరిగి వెళ్లిపోయారు.

స్త్రీనిధి రుణం.. పాడికి ఊతం

- గేదెల కొనుగోలుకు నిధులు
- లబ్ధి పొందుతున్న మహిళా సమైక్య సభ్యులు
- పాల ఉత్పత్తితో కుటుంబానికి ఆసరా



గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలు ప్రగతివైపు బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తోంది. ప్రస్తుతం పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు మహిళా సంఘాలకు నిధులు మంజూరు చేస్తుంది. వీటి ద్వారా పశువులను కొనుగోలు చేసుకొని మహిళలు ఆర్థికంగా కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

సంగారెడ్డి టౌన్ :

జిల్లావ్యాప్తంగా 18369 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 1,94,000 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం ఈ సంఘాల ద్వారా పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తోంది. పశువుల కొనుగోలుకు స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేస్తుంది. ఇప్పటివరకు రూ.13 కోట్ల 86 లక్షల స్త్రీనిధి రుణాలు మంజూరు చేసి మహిళలకు 1486 పాడి పశువులను అందజేశారు. ఈ సంవత్సరం 500 పాడి పశువులను అందించారు. ఒక్కో గేదెకు రూ.65 వేల నుంచి రూ.80 వేల వరకు వెచ్చిస్తున్నారు. కొత్త మహిళా సంఘాలకు కూడా రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కొనుగోలు చేసిన పశువులకు పూర్తిస్థాయి బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. మహిళలు పాల ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. జనాభా అవసరాలకు సరిపడా పాల ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తుంది. గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు ఎక్కువ మంది వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారే ఉండడంతో పశు పోషణకు ప్రభుత్వం చేయూతనిస్తుంది. రుణాలు తీసుకున్న మహిళలు కూడా నెలనెలా సక్రమంగా రుణాలు కడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



స్త్రీనిధి రుణాలను సంబంధించిన ప్రక్రియ అంతా గ్రామైక్య సంఘం స్థాయిలో జరిగేలా చూస్తున్నాం. మహిళలకు రుణాలు అందించి వారికి జీవనోపాధి కల్పిస్తున్నాం. పాడి గేదెలను అందించి పాల వ్యాపారంలో రాణించేందుకు కృషి చేస్తున్నాం. పాల విక్రయాల ద్వారా నెలనెలా బ్యాంకు వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్నారు.

– జంగారెడ్డి, అదనపు డీఆర్డీఓ

కుటుంబానికి ఆసరాగా ఉంది



ఐదు నెలల క్రితం లక్ష రూపాయల రుణం తీసుకొని గేదెను కొనుగోలు చేశా. నిత్యం పాలవిక్రయంతో వచ్చే ఆదాయం కుటుంబానికి ఆసరా అవుతుంది. రుణానికి సంబంధించిన డబ్బు నెలనెలా సక్రమంగా కట్టుకుంటున్నాను. – జుబేదా, సంగారెడ్డి మండలం, గౌడిచర్ల గ్రామం

పాలను విక్రయిస్తూ జీవనం



స్త్రీనిధి బ్యాంకు ద్వారా గేదెను కొనుగోలు చేశా. పాలను అమ్ముకుంటూ నెలనెలా డబ్బులు సంపాదిస్తున్నాను. బ్యాంకు ద్వారా లబ్ధి పొందుతూ జీవనం సాగిస్తున్నాను.

– పోచమ్మ, అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్ గ్రామం

150 మంది కూచిపూడి నృత్య ప్రదర్శన

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో చోటు



నృత్యం చేస్తున్న కళాకారిణి



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సంస్థ ప్రతినిధి నరేందర్ గౌడ్, అనంత్‌కిషన్

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : నటరాజ స్ఫూర్తి డ్యాన్స్ అకాడమీ, వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ స్కూల్‌లో 09 నిమిషాల 05 సెకెన్ల పాటు అన్నమాచర్య కీర్తనపై ఒకేసారి 150 మంది చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఇందుకుగాను అంతర్జాతీయ వండర్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు లభించినట్లు ఆ సంస్థ భారత ప్రతినిధి బింగి నరేందర్ గౌడ్, తెలంగాణా ప్రతినిధి అరుణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మా ఇల్లు సంస్థ అధ్యక్షులు తోపాజి అనంత కిషన్, రాష్ట్ర యువజన సర్వీసుల అధ్యక్షులు కూన వేణు, విష్ణువర్ధన్ రెడ్డి, రామప్ప, ప్రదీప్, నాగరాజు, పుల్లూరి ప్రకాష్, హరీష్, హరికుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఐక్యంగా ఖేడ్ అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: కాంగ్రెస్ కార్యకర్తల కష్ట సుఖాల్లో ఎల్లప్పుడూ తోడుంటామని, ఐక్యంగా ఖేడ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి 9 వర్ధంతి సభను ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లపాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు గ్రామాల్లో ఐక్యంగా పని చేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని, తద్వారా గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం సాధ్యపడుతుందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి స్వర్గీయ కిష్టారెడ్డి ఎంతగానో పాటుపడ్డారని గుర్తు చేశారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, శంకరయ్యస్వామి, శ్రీనివాస్, నగేష్ షెట్కార్, రశీద్, ఆనంద్ స్వరూప్ షెట్కార్, శంకర్ పాల్గొన్నారు.

• అడుగుకో గుంత.. తీరని చింత



బురదమయంగా మారిన కంది మండల పరిధిలోని పైప్‌లైన్ రోడ్డు



జహీరాబాద్ సాయిరాం నగర్ కాలనీ రోడ్డు దుస్థితి

అడుగుకో గొయ్యి, గజానికో గుంత.. ఇదీ జిల్లాలో గ్రామీణ రహదారుల పరిస్థితి. వర్షాకాలం కావటంతో గోతుల్లో నీరు నిలబడి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుంది. జహీరాబాద్ పట్టణంలోని సాయిరాం కాలనీ రోడ్డు ఛిద్రంగా మారి నడవలేని దుస్థితి నెలకొంది. అలాగే కంది మండల పరిధిలోని పైప్‌లైన్ రోడ్డు బురదమయంగా మారి ప్రయాణికులు నరకం చూస్తున్నారు. రోడ్డుపై కంకర తేలడంతో గుంతలు ఏర్పడి వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ దారుణ దారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. జహీరాబాద్ టౌన్ /కంది(సంగారెడ్డి):



బయోచార్ అవగాహన సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, నిర్వాహకులు, రైతులు

బయోచార్ వినియోగంతో సత్ఫలితాలు

బిడెకన్నె అరణ్య వ్యవసాయ సంస్థలో రైతులకు అవగాహన

సంగారెడ్డి జోన్: రైతులు పంట సాగులో బయోచార్ వినియోగం ద్వారా సత్ఫలితాలు వస్తాయని వ్యవసాయ అరణ్య సంస్థ డైరెక్టర్ పద్మ, బయోచార్ ప్రోగ్రెసివ్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.సాయిభాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని బిడెకన్నె గ్రామ శివారులోని అరణ్య వ్యవసాయ శాశ్వత సంస్థ ఫార్మా కల్చర్ ఆధ్వర్యంలో బయోచార్ తయారు విధానం, సాగులో వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా నర్సాపూర్ గ్రామ శివారులో వీయాక్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బయోచార్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దిగుబడి అనంతరం వచ్చే పంట వ్యర్థాలతో బయోచార్ తయారు చేసుకోవచ్చన్నారు. పంట నుండి వచ్చే కట్టెలతో తక్కువ ఆక్సిజన్ ఉన్న ప్రాంతంలో కాల్చి, వచ్చే బొగ్గుకు పశువుల పేడతో తయారు చేసే ఎరువును కలిపితే బయోచార్ తయారవుతుందన్నారు. సాగులో దీని వినియోగం ద్వారా ఐదింతల రెట్టింపు దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఒక్కసారి భూమిలో బయోచార్ వేస్తే వందేళ్ల వరకు ప్రభావం ఉంటుందన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటన

బయోచార్ వినియోగంపై క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. అరణ్య సంస్థ పరిధితో పాటు బిడెకన్నె, నర్సాపూర్ గ్రామంలో బయోచార్ తో సాగుచేసిన పంటలను పరిశీలించారు. ముందుగా అరణ్య సంస్థలో బయోచార్ ఎక్కువ, తక్కువ, తగిన, అధిక, ఏమీ లేకుండా ప్రయోగాత్మకంగా సాగుచేసిన పంటలను పరిశీలించారు. నేలలకు అనుకూలంగా తగిన మోతాదులో వేసిన పంట ఇతర వాటికంటే ఏ విధంగా ఉందో రైతులకు వివరించారు. అవసరం మేరకు వినియోగించిన మొక్కను పరిశీలిస్తే కాండం, ఆకులు, వేర్లతోపాటు పూత, కాత ఎక్కువగా ఉండడం గమనించారు. బొగ్గు భూమిలో వేస్తే మొక్కకు అవసరం మేరకు తగిన పోషకాలు అందిస్తుందన్నారు. బయోచార్ వినియోగం అన్ని రాష్ట్రాలలో విస్తరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

సభ్యత్వంలో బీజేపీదే అగ్రస్థానం

- హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు
- బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ మహేశ్వర్ రెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రపంచంలోనే బీజేపీ అత్యధిక సభ్యత్వం కలిగి ఉందని ఆ పార్టీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ హయాంలో దేశం అభివృద్ధి బాట పట్టిందన్నారు. తెలంగాణలో సైతం అత్యధిక సభ్యత్వమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలు పక్కదోవ పట్టించేందుకే సీఎం రేవంత్ హైడ్రా పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. సెలబ్రిటీల కట్టడాలను కూల్చివేయడం డైవర్ట్ పాలిటిక్స్ కోసమేనని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ నాయకుల నుంచే కూల్చివేతలను ప్రారంభించాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటి నిర్మాణం, సీఎం సొంత తమ్ముడి మీద కూడా ఆరోపణలు వస్తున్నాయని, వాటిని ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువులు, కుంటలను, ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ ఆక్రమించినటువంటి వారిపైన, అనుమతులు ఇచ్చిన అధికారుల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన వాటి వివరాల పై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్, ఎడ్ల రమేష్, వెంకట నరసింహారెడ్డి, పోచారం రాములు, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

అక్షరమాలతో ఉచిత లెర్నింగ్ సేవలు



మెరిట్ సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : అక్షరదాన్ చారిటబుల్ ట్రస్ట్, ఐఐటీ హైదరాబాద్, ఎస్ఈఆర్టీ తెలంగాణ సంయుక్త చొరవతో ప్రారంభమైన అక్షరమాల తెలంగాణ అంతటా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ లెర్నింగ్ సపోర్ట్ సేవలను అందించిందని ఐఐటీహెచ్ డైరెక్టర్ మూర్తి వ్యాఖ్యానించారు. ఆదివారం కందిలోని ఐఐటీహెచ్‌లో అక్షరమాల, వాలంటరీ ఆన్‌లైన్ లెర్నింగ్ సపోర్ట్ సర్వీసెస్ 4వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అక్షరమాల కార్యక్రమంలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఏడుగురు విద్యార్థులకు ప్రొఫెసర్ బీఎస్. మూర్తి చేతుల మీదుగా నగదు పురస్కారాలతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్టీ జిల్లా అధికారి సురేష్‌బాబు, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాటేస్తున్న కాలుష్యం

- ఎవరెస్ట్ పరిశ్రమ వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితం
- దుర్వాసనతో మూడు గ్రామాల ప్రజలు సతమతం
- పట్టించుకోని అధికారులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎవరెస్ట్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాలు పలు గ్రామాలకు శాపంగా మారాయి. పరిశ్రమ వ్యర్థాలతో నీరు, గాలి కలుషితమవుతోంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దుర్వాసనను భరించలేకపోతున్నారు. సదాశివపేట మండల పరిధిలోని ఆరూర్ గ్రామ శివారులోని ఎవరెస్ట్ ఫ్యాక్టరీ 65వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. పరిశ్రమ నుంచి వచ్చే రసాయన వ్యర్థాలను సమీపంలోని చెరువులోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెరువులన్నీ కలుషితం..

కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేసి బయటకు వదలాల్సి ఉంటుంది. కానీ యాజమాన్యం ఇదేమీ పట్టించుకోకపోవడంతో మునిపల్లి మండలం పెద్దగోపులారం శివారులోని లక్ష్మీనారాయణ చెరువులోకి రసాయన వ్యర్థాలు చేరి జలమంతా కలుషితమవుతుంది. అదేవిధంగా ఆ చెరువు కట్టను ధ్వంసం చేయడంతో వ్యర్థ జలాలు ఆరూర్, కోనాపూర్, నాగులపల్లి గ్రామాల మీదుగా గంగాకత్వలోకి చేరుతున్నాయి. గంగాకత్వ కాలువ మీదుగా ఆత్మకూర్, ఎన్కేపల్లి, వెంకటాపూర్ చెరువుల నీటిని సైతం కలుషితం చేసి చివరకు మంజీర జలాల్లోకి చేరుతున్నాయి. ఆ నీటిని తాగిన మూగ జీవాలు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే సమీపంలోని పంట పొలాలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక వర్షం పడితే పరిశ్రమ యాజమాన్యానికి పండగే. వరద నీటిలో కలిసిపోయేలా రసాయన జలాలను వదులుతారు.

భరించలేని దుర్వాసన

పరిశ్రమ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ఆరూర్, కోనాపూర్, పెద్దగోపులారం గ్రామాల ప్రజలతో పాటు, జాతీయ రహదారి మీదుగా ప్రయాణిస్తున్న వారు సైతం ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా జల, వాయు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవల పరిశ్రమ నుంచి వస్తున్న దుర్వాసనను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. రాత్రుల్లో పరిశ్రమ వెదజల్లే దుర్వాసనను భరించలేకపోతున్నామని, దీనిపై పలుమార్లు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించి జల, వాయు కాలుష్యానికి కారణమైన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కాలువలో ప్రవహిస్తున్న పరిశ్రమ రసాయన వ్యర్థ జలాలు (ఫైల్)

పరిశ్రమపై ఫిర్యాదు అందింది

ఎవరెస్ట్ పరిశ్రమపై ప్రజల నుంచి ఫిర్యాదు అందడంతో పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశాం. అదేవిధంగా పరిశ్రమ నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించాం. ఫలితాల్లో కాలుష్యం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తాం. వచ్చిన ఫలితంపై పీసీబీ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పరిశ్రమపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. – గీత, పీసీబీ ఈఈ, సంగారెడ్డి జిల్లా

క్లుప్తంగా

హైనా దాడిలో 15 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహ్మద్ సాదిక్ అనే రైతు గొర్రెలను పెంచుతున్నాడు. రోజు మాదిగానే శనివారం సాయంత్రం గొర్రెలను దొడ్డిలోకి పంపి ఇంటికి వచ్చాడు. తెల్లవారుజామున దొడ్డి వద్దకు వెళ్లి చూడగా 15 గొర్రెలు మృతి చెందడంతోపాటు ఐదు గొర్రెలు గాయపడి ఉన్నాయి. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

లింక్‌ను క్లిక్ చేశాడు

రూ.2.10 లక్షలు పోగొట్టుకున్నాడు

పటాన్‌చెరు టౌన్: సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి ఓ వ్యాపారి డబ్బులు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన ఓ వ్యాపారి ఫోన్‌కు 23వ తేదీన అపరిచిత వ్యక్తి నుంచి లింక్ మెసేజ్ వచ్చింది. బాధితుడు ఆ లింకును క్లిక్ చేయగా ఫోన్ అపరిచిత వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. వెంటనే అతడి ఖాతాలో ఉన్న రూ. 2.10 లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భూమి ఆక్రమణ

హుస్నాబాద్‌రూరల్: వరి నాటును ధ్వంసం చేసి భూమిని ఆక్రమించారని ఓ బాధితురాలు శనివారం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు.. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల లక్ష్మికి సరిహద్దు గ్రామం ఉమ్మాపూర్ శివారులోని పలు సర్వే నంబర్లలో వ్యవసాయ భూమి పట్టా ఉంది. 30 ఏళ్ల నుంచి చదును చేసుకొని పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల భూమిలో వరి నాటు వేసుకున్నారు. దీనిని పక్క రైతు ధ్వంసం చేసి ఆక్రమించాడని బాధితురాలు కుమారుడు సంపత్‌తో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

పంట ధ్వంసం


ధ్వంసమైన పంట

మద్దూరు(హుస్నాబాద్): మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని బెక్కల్ గ్రామ పరిధిలోని శివాలి తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన లకవత్ రాజు అనే రైతు తనకున్న రెండుకరాల్లో మొక్కజొన్న పంటను వేశాడు. రెండు రోజులుగా రాత్రి వేళల్లో అడవి పందులు ధ్వంసం చేశాయి. సుమారు రూ.75 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

గోదాంలో అగ్ని ప్రమాదం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్లలోని మక్కల గోదాములో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గోదాంలో పొగలు రావడంతో గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా, మంటలార్పివేసినట్టు పేర్కొన్నారు గోదాంలో విద్యుత్ ప్రమాదంతో మంటలు చెలరేగి ప్లాస్టిక్ కవర్లు మాత్రమే దగ్ధమయ్యాయి.

బిల్లులు రాక.. పనులు సాగక

ఆగిన పంచాయతీ భవనాల నిర్మాణం

- సమయానికి నిధులు రాకనే..
- సర్పంచ్‌లు సైతం లేకపోవడంతో నత్తనడకన
- హుస్నాబాద్ డివిజన్‌లో అధ్వాన పరిస్థితులు


చౌటపల్లిలో నిధులు లేక నిలిచిపోయిన భవన నిర్మాణం

హుస్నాబాద్‌రూరల్: పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించడానికి గత ప్రభుత్వం శివారు పల్లెలు, గూడెంలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఈ గ్రామాల్లో సరైన పాలనను సాగించడానికి గ్రామ పంచాయతీ భవనాలను సైతం మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన అప్పటి గుత్తేదారులు సమయానికి బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే నిలిపివేశారు. దీనికి తోడు సర్పంచ్‌ల పదవీకాలం సైతం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. ఈ క్రమంలో ఆగిపోయిన పంచాయతీ భవనాల నిర్మాణాలను పట్టించుకునే వారు లేరు.

జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామ సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బంది ఉండకూడదని శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాల స్థానంలో కొత్తవాటిని గత ప్రభుత్వం మంజూరు చేసింది. పల్లె ప్రగతిలో భాగంగా పాత ఇళ్లు, గోడలను సైతం కూల్చివేసింది. ప్రతీ గ్రామ పంచాయతీకి విశాలమైన భవనాలు ఉండాలని ప్రభుత్వం ఒక్కొక్క గ్రామ పంచాయతీకి భవనానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించింది. హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట 21 మంజూరు అయితే 19 భవనాల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కోహెడ 10 మంజూరు కాగా 6 పూర్తయ్యి 4 అసంపూర్తిగా ఉన్నాయి. హుస్నాబాద్‌కు 10 మంజూరైతే రాములపల్లి, వంగరామయ్యపల్లి గ్రా మాల్లోనే పనులు పూర్తి అయ్యాయి. మిగితావి మధ్యలోనే ఆగిపోయాయి. వీటికి సైతం ఇంతవరకు బిల్లులు రాలేదు. జనవరితో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం, ప్రభుత్వం మారడంచేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు చేయడానికి గుత్తేదారులు ఎవరూ ముందుకు రావడం లేదు.

బిల్లులు లేక వడ్డీల భారం..

గత సర్పంచ్‌ల కాలంలోనే ప్రభుత్వం నిధులు ఇవ్వడం, సర్పంచ్‌లు పనులు చేయడంతో చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు, మహిళా భవనాలు, క్రీడా ప్రాంగణాలు, మురికి కాల్వలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు నిర్మాణం చేయడంతో గ్రామాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వ నిధులు నేరుగా ఇవ్వడంతో ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్, ట్యాంకర్లను కొనుగోలు చేయడం వల్ల గ్రామాలకు రూ.15 లక్షల స్థిరాస్తి సమకూరింది. ఇదే ఉత్సాహంతో సర్పంచ్‌లు కొందరు పంచాయతీ భవనాలను ప్రారంభించి పూర్తి చేసినా ఇంత వరకు బిల్లులు రాలేదు. ఒక్క పైసా రాకపోవడంతో వారికి పెట్టుబడులకు వడ్డీ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు ఇంకా నిర్వహించలేదు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల చేతుల మీదుగా పాలన నడుస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి పనులు సైతం ఎక్కడికక్కడే కుంటుపడిపోయాయి. గ్రామ పంచాయతీ భవనాల బిల్లులు, అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

రూ.13 లక్షల పనులు చేశా..



మా హయాంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపడమే కాకుండా కొత్త పంచాయతీ భవనం నిర్మించాలని రూ.20 లక్షల వ్యయంతో పనులు మొదలు పెట్టిన. రూ.13 లక్షల పనులు చేసిన ఒక్క పైసా రాక తెచ్చిన అప్పులకు వడ్డీ భారంతో పనులు చేయలేకపోతున్నా. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదు. చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదు. గత ప్రభుత్వం చేయలేదనే కొత్తవారికి అవకాశం కల్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి మా సర్పంచ్‌ల బిల్లులు ఇప్పించాలి.
– గద్దల రమేశ్, సర్పంచ్, చౌటపల్లి

వెంటనే బిల్లులు చెల్లించాలి



మా ఊరును కేసీఆర్ కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిండు. చిన్న గ్రామైనప్పటికీ అభివృద్ధిలో పోటీ పడి పనులు చేసినం. మా ఊరికి గ్రామ పంచాయతీ భవనము కావాలని కొట్లాడి తెచ్చుకొని పనులు పూర్తి చేయించిన, రూ. 20 లక్షలకు ఒక్క పైసా రాలేదు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించాలి.
– గంగం మదన్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ,రాములపల్లి

నిధులు లేక ఆగిన పనులు



హుస్నాబాద్ డివిజన్‌లో అక్కన్నపేటలో 19, హుస్నాబాద్ 8, కోహెడ 4 గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు నిధులు లేక ఆగిపోయాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు చేయాలని ఆదేశిస్తే గ్రామ పంచాయతీ భవనాల పనులు ప్రారంభమవుతాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడం కూడా పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.
– టీ.మహేశ్, డీఈ, హుస్నాబాద్

విద్యార్థి ప్రాణం తీసిన గేదె

- పశువుపై కూర్చొని చేనుకి వెళ్లిన బాలుడు
- నడుముకు తాడు కట్టుకొని మేపుతుండగా ఈడ్చుకెళ్లిన వైనం
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి


రాజు (ఫైల్)

కంగ్టి(నారాయణఖేడ్): ఆదివారం బడికి సెలవుదినం కావడంతో గేదెపై కూర్చొని సరదాగా పంట చేనుకి వెళ్లాడు. గేదె తాడును తన నడుముకి కట్టుకొని అక్కడే చుట్టుపక్కల మేపుతున్నాడు. బాలుడు దానికి దగ్గరికి వెళ్లగా ఏమైందో తెలియదు గాని ఒక్కసారిగా కిందపడేసి ఈడ్చుకెళ్లింది. తీవ్ర గాయాలైన అతడిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మారుతీ, పార్వతి దంపతులకు ముగ్గురు కుమారులు. ఇందులో రెండవ కుమారుడు రాజు(9) స్థానికంగా నాల్గవ తరగతి చదువుతున్నాడు. రాజు తరుచుగా వారి గేదెపై కూర్చొని పంట చేనుకి వెళ్తుంటాడు. రోజు మాదిరిగా ఆదివారం కూడా వెళ్లాడు. సాయంత్రం గేదెకు కట్టిన తాడు తన నడుముకు కట్టుకొని దాని దగ్గరకు వెళ్లగా ఒకేసారిగా కిందపడేసింది. అంతటితో ఆగకుండా నేలపై లాక్కొని రాళ్లు, ముళ్లలో నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పంట చేనులోనే ఉన్న కుటుంబీకులు బీదర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. చిన్న వయస్సులోనే కొడుకు చనిపోవడం చెందడం తల్లిదండ్రులకు తీరని దు:ఖాన్ని మిగిల్చింది.

కులగణన చేపట్టాలి

నగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్

రామాయంపేట(మెదక్): కులగణన చేపట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుముఖత వ్యక్తం చేయకపోవడం బాధాకరమని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ వాపోయారు. ఆదివారం మండలంలోని అక్కన్నపేటలో సగర కులగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 అంశాలతో కూడిన సమగ్ర సమాచారంతో కులగణన చేపట్టామన్నారు. సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ సంఘాలు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోడంలేదన్నారు. అధికారంలోకి వస్తే ఆరు నెలల్లోపు కులగణన చేపట్టడంతోపాటు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మాట నిలుపుకోలేదన్నారు. కార్యక్రమంలో అక్కన్నపేట సంఘం అధ్యక్షుడు వగ్గు క్రిష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి మర్కు దత్తాత్రేయ, రాష్ట్ర యువజన సంఘం కోశాధికారి సాయి గణేశ్, జిల్లా అధ్యక్షుడు సాయిలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేశ్, రాష్ట్ర నాయకులు వగ్గు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, సీపీఐ పొత్తు కొనసాగించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

హుస్నాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో సీపీఐ స్నేహపూర్వక పొత్తు కొనసాగించాలని భావిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శంకర్ తెలిపారు. పట్టణంలోని అనబేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో సీపీఐ పొత్తుతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ఛాయలున్న స్థానాల్లో, బలమున్న స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. రైతు రుణ మాఫీ 70 శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ వర్తించిందన్నారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులకు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో రైతు సమస్యల పై సీపీఐ పోరాడుతుందని తెలిపారు. 27వ తేదీన రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతు బీమా, రైతు బంధు పథకాల అమలు పై కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి సీపీఐ మద్దతు ఇస్తుందని తెలిపారు. సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులను స్మరించుకుంటూ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు జాగిరి సత్యనారాయణ, వనేష్, కసుకుంట్ల శంకర్, సంజీవరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే తాళం వేసి ఇళ్లలో చోరీ

భారీ ఎత్తున నగదుపాటు బంగారు ఆభరణాలు అపహరణ



ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

సిద్దిపేటకమాన్: పట్టపగలే తాళం వేసిన ఇళ్లలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బంగారం, వెండి ఆభరణాలతోపాటు భారీ ఎత్తున నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చిగుళ్లపల్లి కృష్ణమూర్తి భార్య శ్రీలక్ష్మీతో కలిసి పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు ఆదివారం మధ్యాహ్నం ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 13 తులాల బంగారం, సుమారు 70 తులాల వెండి, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. అనంతరం అదే అపార్ట్‌మెంట్‌లోని పై అంతస్తులో గల ఆకుల రాజు ఇంట్లో రూ.2 లక్షల 5 వేల నగదు, 20 తులాల వెండి దోచుకెళ్లారు. మరో ఇంట్లో కూడా దుండగులు దొంగతనానికి ప్రయత్నించగా అక్కడ ఏమి దొరక్కపోవడంతో వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న బాధితులు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం సిబ్బందితో కలిసి వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ మధు పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రక్తమోడిన రహదారులు

ఉమ్మడి జిల్లాలోని రహదారులు రక్తసిక్తమయ్యాయి. ఆదివారం ఒక్కరోజే జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. నాందేడ్– అకోలా జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వచ్చి లారీని ఢీకొట్టి ఇద్దరు మృతి చెందారు. కొండపాకలో కారు ఢీకొని వ్యక్తి, చేర్యాలలో బొలేరో వాహనం ఢీకొని మరొకరు, పటాన్‌చెరులో గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ చనిపోయారు. మరికొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

- వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి
- పలువురికి తీవ్ర గాయాలు

బొలేరో వాహనాన్ని ఢీకొని..

చేర్యాల(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఏపీలోని కర్నూలు జిల్లా మల్కాపురానికి చెందిన బోయ హరి (26), నంద్యాలకు చెందిన భీమన్నగారి గోపాల్ మద్దూరు మండలం నర్సాయపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణ పనులు చేస్తున్నారు. ద్విచక్ర వాహనంపై పట్టణానికి వచ్చి వెళ్తూ ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే హరి మృతి చెందినట్లు తెలిపారు. గోపాల్‌ని మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలించారు.

బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్తూ..


వీరేశం (ఫైల్)

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. గురువన్న పేటకు చెందిన వీరేశం (36) కోహెడ మండలంలోని శనిగరంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి బైక్‌పై వెళ్తున్నాడు. అలాగే, దుద్దెడకు చెందిన జక్కుల రాకేశ్, లక్ష్మణ్ కొమురవెల్లి మల్లన్నను దర్శించుకొని బైక్‌పై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి జగిత్యాలకు అతివేగంగా వెళ్తున్న కారు దుద్దెడకు చెందిన వారి బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అన్నాదమ్ముళ్లు జక్కుల రాకేశ్, జక్కుల లక్ష్మణ్‌లకు గాయాలయ్యాయి. అనంతరం కారు సడెన్ బ్రేక్ వేయడంతో వెనుకాల బైక్‌పై వస్తున్న వీరేశం కారును ఢీకొట్టి రోడ్డుపై ఎగిరి పడ్డాడు. విషయం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది ముగ్గురు క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వీరేశం మృతి చెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవరు జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని జాగిర్ కొండాపూర్ గ్రామానికి చెందిన కుంటు రవి తేజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రుద్రారం గ్రామానికి చెందిన సంతోష(54) ఆదివారం ఉదయం గ్రామంలోని కల్లు దుకాణం శుభ్రం చేయడానికి ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్తుంది. జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం సంతోషను ఢీ కొట్టింది. ఈప్రమాదంలో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కూతురు శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కూతురి తొట్టెల ఫంక్షన్‌కు పిలవడానికి వెళ్తూ..

బైక్‌తో లారీని ఢీకొట్టి బావ, బావమరిది మృతి


ఘటనా స్థలంలో శ్రీనివాస్ మృతదేహం


సునీల్ (ఫైల్)

నారాయణఖేడ్: కూతురు తొట్టెల ఫంక్షన్‌కు బంధువులను ఆహ్వానించేందుకు బావమరిదితో కలిసి బావ బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. మృతుడి కుటుంబీకులు, ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం మేరకు.. కంగ్టి మండలం భీంరా గ్రామానికి చెందిన సునీల్ (25) హైదరాబాద్‌లో పానీపూరీ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కూతురు పుట్టడంతో 27వ తేదీన బుధవారం తొట్టెల ఫంక్షన్ ఏర్పాటు చేసుకున్నాడు. తొట్టెల ఫంక్షన్‌కు జోగిపేట, సంగారెడ్డిలోని ఉన్న బంధువులను ఆహ్వానించేందుకు మోటార్ సైకిల్‌పై బావమరిది అయిన మహారాష్ట్రలోని దెగ్లూర్ సమీపంలోని నారంగల్‌కు చెందిన శ్రీనివాస్ (27)తో కలిసి ఆదివారం మధ్యాహ్నం బయలు దేరాడు. నిజాంపేట్ సమీపంలోకి రాగానే అకోలా– నాందేడ్ 161 జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన సునీల్‌ను జోగిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మోటారు సైకిల్‌పై రాంగ్‌రూట్‌లో రావడంతోనే ప్రమాదం జరిగిందని ఎస్ఐ వివరించారు.

చికిత్స పొందుతూ..


చందుబాబు(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మనోహరాబాద్ మండలంలోని రంగాయపల్లి గ్రామానికి చెందిన బండారు చందుబాబు (25) రోజులుగా అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లి చేయమని యువతి తల్లిదండ్రులను అడుగగా వారు ఒప్పుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైయాడు. ఈ క్రమంలో 13వ తేదీన గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతుకుతుండగా అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం



కొల్చారం(నర్సాపూర్): గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయల మొదటి బ్రిడ్జి వద్ద ఆదివారం వెలుగుచూసింది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. బ్రిడ్జి సమీపంలోని కుమార్ ఫామ్ హౌస్ వద్ద ఆదివారం వృద్ధుడి మృదేహం ఉందని సమాచారం వచ్చింది. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉంటుందని, మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ కొల్చారం 87126 57919, మెదక్ రూరల్ సీఐ 87126 57916, మెదక్ డీఎస్పీ 87126 57903కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

విద్యార్థులను 'ఇన్‌స్పైర్' చేద్దాం

ఎగ్జిబిట్‌ల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం

- సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ రాహుల్‌రాజ్
- ప్రతీ పాఠశాల నుంచి ఎగ్జిబిట్ రావాలని ఆదేశం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, తదితరులు (ఫైల్)

మెదక్ కలెక్టరేట్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో నైపుణ్యాలు సాధించినప్పుడే భవిష్యత్ ఉంటుంది. విద్యార్థుల్లో చదువుతోపాటు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఇన్‌స్పైర్ మనక్' పథకాన్ని నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా ఎగ్జిబిట్‌ల ఆన్‌లైన్ నామినేషన్ ప్రక్రియను ప్రారంభించింది. విద్యార్థులు తప్పనిసరిగా శాస్త్రీయ దృక్పథంతో కూడిన ప్రదర్శనలు రూపొందించేలా అవగాహన కల్పించాలని ప్రభుత్వం పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది.

ఐదు తప్పనిసరిగా ఉండాలి

జిల్లాలోని అన్ని పాఠశాలలు తప్పనిసరిగా ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనాలని, పాఠశాల నుంచి 5 నమూనాలు ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఈ నెల 20న మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో 'ఇన్‌స్పైర్ మనక్'కు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఎగ్జిబిట్‌లను రూపొందించేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ మనక్‌పై విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో 56,437 మంది విద్యార్థులు

జిల్లాలో 152 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉండగా 56,437 మంది విద్యార్థులు 6 నుంచి 10 తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా నమూనాల తయారీకి అర్హులే. ప్రతీ పాఠశాల నుంచి కనీసం 5 నమూనాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు పరిశీలించి వినూత్నమైన వాటిని రూపొందించిన విద్యార్థి ఖాతాలో రూ.10 వేల జమ చేస్తారు. ఇందులో రూ.5 వేలు ఎగ్జిబిట్ తయారీకి, మరో రూ.5 వేలు రవాణా చార్జీలుగా అందిస్తారు. వీటిని వినియోగించుకోవాలి.

రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శన..

జిల్లా స్థా యిలో ఉత్తమమైన 10 శాతం నమూనాలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చే ఎగ్జిబిట్‌లు పోటీల్లో ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శనలో ఉత్తమమైన 10 శాతం నమూనాలను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ మరో 60 శాతం వాటిని ఎంపిక చేసి రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శిస్తారు. ఎగ్జిబిట్‌లు రూపొందించిన విద్యార్థులకు వాటిపై పేటెంట్ హక్కు కల్పిస్తారు.

ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి



వినూత్న ఆలోచనలే ఆవిష్కరణలవుతాయి. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించి అందులో నుంచి ఉత్తమమైన ఐదు నమూనాలు ఎంపిక చేసి అప్‌లోడ్ చేయాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు వినూత్నమైన ఆలోచనలనే ఎంపిక చేస్తారు.
– రాజిరెడ్డి. జిల్లా సైన్స్ అధికారి

సెప్టెంబర్ 15 తుది గడువు

ఈ విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిట్‌ల ఆన్‌లైన్ నామినేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ సెప్టెంబర్ 15తో ముగియనుంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు తమ నమూనాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా పొందుపర్చుకోవాలి. రెండేళ్లలో ఆశించిన స్థాయిలో ఎగ్జిబిట్‌లు ఎంపిక కాలేదు. ఈసారైన పెద్ద ఎత్తున ఎగ్జిబిట్‌లో ఎంపికయ్యేలా చర్యలు చేపడుతున్నారు.